ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 245

గురువారం 17 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

భారత్‌పై 100% టారిఫ్? మరో బిగ్ బాంబ్ కు అమెరికా రె'ఢీ'

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 16)



రష్యా నుంచి ముడి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న దేశాలకు అమెరికా నుంచి భారీ ఆర్థిక షాక్ ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసే దేశాలపై గరిష్ఠంగా 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి ఇచ్చే బిల్లుకు ప్రతినిధుల సభలో కీలక ముందడుగు పడింది. దీంతో రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై కూడా ఈ ప్రతిపాదిత సుంకాల ప్రభావం పడే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. అయితే బిల్లు ముందుకు వెళ్లడం.. భారత్‌పై వెంటనే 100 శాతం టారిఫ్ అమల్లోకి రావడం రెండూ ఒకటే కాదు.

214-211తో హౌస్‌లో ప్రొసీజరల్ ఓటు : "రష్యా మరియు ఇరాన్‌లపై ఆంక్షలు విధించే 2026 నాటి లిండ్సే ఓ. గ్రాహం చట్టం"గా ▶ 2లో

భూవివాదం.. మోదీ స్కూల్‌మేట్‌కు దక్కిన ఊరట




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 16)

ఏళ్ల నాటి భూవివాదంలో ప్రధాని మోదీ స్కూల్‌మేట్ అస్గర్‌అలీ వోహ్రాకు ఊరట లభించింది. ఈ వివాదం నుంచి వెనక్కి తగ్గిన స్థానిక భాజపా ఎమ్మెల్యే.. ప్రధాని స్నేహితుడికి భూమిని అప్పగించారు. ఈ ఆస్తి వ్యవహారం గురించి అస్గర్ అలీ ఇటీవల మోదీని కలిసిన కొన్ని రోజులకే తాజా పరిణామం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మహారాష్ట్రలోని థానె జిల్లాలో నివసిస్తోన్న 81 ఏళ్ల అస్గర్‌అలీ వోహ్రా.. గుజరాత్ లోని భయందర్ ఈస్ట్‌లో గల నవ్‌ఘర్ రోడ్డులో ఉన్న సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని 1989లో కొనుగోలు చేశారు. ఈ భూమిని 2011లో స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ అనే రెండు సంస్థలు ఆక్రమించుకున్నాయని ▶ 2లో

నేడు వారణాసి వెళుతున్న సీఎం చంద్రబాబు

మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం..



ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై వారణాసిలో ప్రత్యేక కార్యక్రమం

'సేవా సంకల్ప్ అభియాన్'కు హాజరుకానున్న సీఎం చంద్రబాబు

వారణాసి-వాద్‌నగర్ సేవా యాత్రలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

రేపు ఉదయం వారణాసికి బయలుదేరనున్న చంద్రబాబు

పర్యటనలో భాగంగా కాశీ విశ్వనాథుని దర్శించుకోనున్న సీఎం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 16)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం (సెప్టెంబరు 17) వారణాసిలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని కాశీలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలకు గుర్తుగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా ప్రధాని రాజకీయ జీవితంతో ముడిపడిన వారణాసి, ఆయన స్వస్థలం వాద్‌నగర్‌ను కలుపుతూ 'వారణాసి--వాద్‌నగర్ సేవా యాత్ర'ను చేపట్టారు. యువత, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థల భాగస్వామ్యంతో జరిగే ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని సేవా యాత్రను ఫ్లాగ్ ఆఫ్ చేస్తారు. దేశాభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి అంశాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ▶మిగతా 2లో

పవన్ ఛాన్స్ తీసుకోవాల్సిందేనా ?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 16)



జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇక ఛాన్స్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక విధంగా చూస్తే జనసేన అధినాయకత్వానికి ఇపుడు కీలక నిర్ణయం తీసుకోవడం రాజకీయ అనివార్యతగా మారుతోంది. ఒక వైపు పార్టీని నమ్ముకుని దశాబ్దం పైగా పనిచేస్తున్న కార్యకర్తలు ఒక వైపు ఉన్నారు. మరోవైపు తాను కూటమి కట్టి నిలబెట్టిన రాజకీయ వేదిక ఉంది. దీంతో పవన్ ఇపుడు చాలా సంక్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు అని అంటున్నారు.

నిజానికి చూస్తే జనసేన మిత్ర పక్షంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తన డిమాండ్ సాధించుకోవాల్సి ఉంది. ఎందుకంటే పార్టీయే ఎవరికైనా ముఖ్యం. కార్యకర్తల అభీష్టంతోనే పార్టీలు నడుస్తాయి. వారే జీవగర్రగా ఏ పార్టీకైనా ఉంటారు. అధినేత సుప్రీం అయినా కార్యకర్తలు సైతం ఆ నిర్ణయాలను విశేషంగా ప్రభావితం చేస్తూంటారు.

న్యాయమైన డిమాండ్ గానే : విషయానికి వస్తే జనసేన కోరింది ముప్పయి శాతం సీట్లు. అది న్యాయమైన డిమాండ్ గానే చూస్తున్నారు. జనసేనకు కోరిన విధంగా సీట్ల పంపిణీ చేసినా పెద్ద పార్టీ అయిన టీడీపీకి 70 శాతం ఉంటుంది. అందులో బీజేపీకి 10 శాతం ఇచ్చినా అరవై శాతం సీట్లలో పోటీ చేయవచ్చు. ఇది కూటమిలో మిత్ర ధర్మానికి కూడా సంకేతంగా ఉంటుంది. అదే కనుక జరిగితే కూటమి మరింత పటిష్టం అవుతుంది. అంతా కలిసి ఐక్యంగా పనిచేస్తారు. ఏపీలో ఉన్న మొత్తం ▶ 2లో

బీజేపీకి యూసీసీ చిక్కులు.. ఏపీ మాటేంటి?

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 16)

కేంద్రంలోని బీజేపీ చిక్కుల్లో పడుతోందా? యూసీసీని ఖచ్చితంగా అమలు చేసిన తర్వాత.. వచ్చే ఎన్నికలకు వెళ్తా మని కేంద్ర హోం శాఖమంత్రి,



బీజేపీ అగ్రనేత అమిత్ షా ప్రకటన చేసిన తర్వాత.. రాజకీయ పరిణామాలు మారుతున్నాయా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. ముఖ్యంగా బీహార్ లో జేడీయూ నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో తాజాగా యూసీసీ మంటలు రేపింది. ఇక, ఏపీలోనూ ఎన్డీయే కూటమి ఉన్న నేపథ్యం లో ఇక్కడ ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది. ▶ 2లో

జగన్ రాజకీయం చెయ్...

సీనియర్లు కోరేది ఇదేనా ?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 16)

అదేంటి జగన్ రాజకీయాల్లోనే కదా ఉన్నది, మళ్లీ ఇదేమిటి అన్న సందేహం రావచ్చు. అయితే జగన్ రాజకీయాల్లో ఉన్నా కూడా పక్కా వ్యూహాలతో ఎత్తుగడలతో రాజకీయం చేయాల్సిన అవసరం ఉంది అన్నదే సీనియర్ల మాట. వైసీపీ విషయం తీసుకుంటే జగన్ అధినేతగా ఉన్నారు. ఇక పార్టీ దైనందిన వ్యవహారాలు చూసేందుకు పార్టీ నుంచి వెళ్ళిపోయిన విజయసాయిరెడ్డి లాంటి వారు చెప్పే కోటరీ ఒకటి ఉందని అంటున్నారు. అన్ని విషయాలను సజ్జల రామక్రిష్ణారెడ్డి వంటి వారే చూసుకుంటున్నారు అని అంటున్నారు. ఇక జిల్లాల విషయానికి వచ్చేసరికి రీజనల్ కో ఆర్డినేటర్లను మూడేసి జిల్లాలకు నియమించారు. వారు అక్కడి విషయాలను పర్యవేక్షిస్తారు. ఇలా కొందరు సీనియర్ నేతల చేతిలో పార్టీని పెట్టేసినట్లుగా ఉందని అంటున్నారు. అక్కడ వారు ఏమి చెబితే అదే జరుగుతోందని అంటున్నారు. దాంతో జగన్ మీద వైసీపీ మీద అభిమానం ఉన్న వారు కూడా వైసీపీలో కొనసాగే పరిస్థితులు లేకుండా పోతున్నాయని అంటున్నారు.

నేరుగా అనుసంధానం : అధినాయకుడు పార్టీ నాయకులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అలాగే పార్టీలో ఎక్కడ ఏమి జరుగుతుంది అన్నది ▶ 2లో

రావాలి అవంతి అంటున్న వైసీపీ !




(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 16)

నాకొద్దీ పార్టీ అని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇప్పటికి రెండేళ్ళ క్రితం వైసీపీని వీడిపోయారు. చిత్రంగా ఇపుడు వైసీపీకి ఆయనే అవసరం అవుతున్నారు అని అంటున్నారు. భీమునిపట్నం వైసీపీ ఇంచార్జిగా ఉన్న చిన్న శ్రీను టీడీపీలో చేరిపోయారు. ఆయన పార్టీని వీడి పది రోజులకు దగ్గర పడుతున్నా భీమిలీ వైసీపీ ఇంచార్జిగా ఎవరిని ఎంపిక చేయాలో తెలియక ఆ పార్టీ సతమతం అవుతోంది. వైసీపీకి భీమిలీ ఇపుడు అతి పెద్ద పరీక్ష పెడుతోంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిని, అలాగే నెల్లిమర్ల వైసీపీ ఇంచార్జిని వెంటనే నియమించిన వైసీపీ అధినాయకత్వం భీమిలీ విషయంలో మాత్రం ఏమీ పాలుపోక ఆగిపోయిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే భీమిలీ టీడీపీకి కంచుకోట. అక్కడ వైసీపీని నడపడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అర్ధబలం అంగబలం ఉన్న నేతల కోసం పార్టీ చూస్తోంది.

వైసీపీ సర్వేలో ఆయనే : ఇదిలా ఉంటే భీమిలీ నియోజకవర్గానికి కొత్త వైసీపీ ఇంచార్జిగా ఎవరిని నియమించాలి ▶ 2లో

భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 16)

అంతర్జాతీయ జలాల్లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో భారత నౌకను పాక్ నౌక ఢీకొట్టింది. దీనిని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీంతో పాక్ దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీచేసింది.

గతేడాది పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో మంగళవారం సాయంత్రం భారత నౌకను పాక్ షిప్ ఢీకొట్టింది. ఇది నిర్లక్ష్యపూరిత ప్రవర్తనగా భారత్ ఖండించింది. "సైనిక విన్యాసాలు, కసరత్తులు , దళాల కదలికలపై ముందస్తు నోటీసుకు సంబంధించి ఇరు దేశాల మధ్య 1991లో ఒప్పందం ఉంది. ఆ ఒప్పందంలోని ఆర్టికల్ 10ని పాక్ నౌక ఉల్లంఘించింది. అనైతిక పద్ధతిలో విన్యాసాలు చేయడమే ఈ పరిస్థితికి దారితీసింది" అని పేర్కొంది. అలాగే దిల్లీలోని పాకిస్థాన్ అత్యున్నతస్థాయి దౌత్యప్రతినిధికి సమన్లు ఇచ్చింది. ▶ 2లో

మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం..

సీఎం పర్యటన వివరాలు : ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం 7:30 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9:35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ఉదయం 11:15 గంటలకు శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకుంటారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3:10 గంటలకు వారణాసి నుంచి తిరుగుపయనమై సాయంత్రం 5:15 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

భారత్‌పై 100% టారిఫ్? మరో బిగ్ బాంబ్ కు అమెరికా రె'ఢీ'

పిలుస్తున్న ఈ బిల్లు అమెరికా హౌస్‌లో 214-211 ఓట్ల తేడాతో కీలక ప్రొసీజరల్ అడ్డంకిని దాటింది. ఇద్దరు డెమొక్రటిక్ సభ్యులు రిపబ్లికన్లతో కలిసి ఓటు వేశారు. దీంతో బిల్లుపై తుది ఓటింగ్‌కు మార్గం సుగమమైంది. తాజా నివేదికల ప్రకారం తుది ఓటింగ్ బుధవారం జరగనుంది. ఇప్పటికే ఈ బిల్లును అమెరికా సెనేట్ ఆగస్టు 7న 86-11 ఓట్ల భారీ మెజారిటీతో ఆమోదించింది. ఇప్పుడు హౌస్ ఆమోదం పొందితే తదుపరి దశలో అధ్యక్షుడి వద్దకు వెళ్లే అవకాశం ఉంటుంది.

భారత్ పేరు ఎందుకు తెరపైకి వచ్చింది? : ఇక్కడే భారత్‌కు సంబంధించిన అసలు అంశం ఉంది. హౌస్‌లో ప్రవేశపెట్టిన ఒక సవరణలో రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాలను ప్రత్యేకంగా పేర్కొనే ప్రతిపాదన ఉంది. అందులో భారత్, చైనా, తుర్కియే, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవాక్ రిపబ్లిక్, యూఏఈ, సింగపూర్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్ ఉన్నాయి. ఈ దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం కల్పించే నిబంధనను సవరణలో ప్రతిపాదించారు. అంటే భారత్‌పై 100 శాతం టారిఫ్ ఇప్పటికే విధించబడిందని కాదు. బిల్లు చట్టంగా మారితే, రష్యా ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా అధ్యక్షుడికి భారీ టారిఫ్ విధించే అధికారం లభించవచ్చన్నది ప్రస్తుత పరిణామం.

అమెరికా లక్ష్యం ఏంటి?

ఈ బిల్లు కేవలం చమురు కొనుగోలుదారులపైనే దృష్టి పెట్టలేదు. రష్యా నాయకత్వం, ఇంధన రంగం, ఆర్థిక సంస్థలు, అలాగే ఆంక్షలను తప్పించుకోవడానికి ఉపయోగిస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తున్న 'షాడో ఫ్లీట్' నౌకలపై కూడా ఆంక్షలను కఠినతరం చేయడం ఇందులో ఉంది. రష్యా చమురు ఆదాయం ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూరుస్తోందన్న అమెరికా వాదనకు అనుగుణంగా ఈ చర్యలు ప్రతిపాదించారు. అదే సమయంలో ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను కొనసాగించే అంశం కూడా బిల్లులో ఉంది.

భారత్‌కు అసలు సమస్య ఎక్కడ?

భారత్ గత కొన్నేళ్లుగా రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు దిగుమతి చేసుకుంటోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా భారత రిఫైనరీలకు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ముడి చమురు సరఫరాను నిర్వహించుకునే అవకాశం లభిస్తోంది. అయితే అమెరికా ప్రతిపాదిత సెకండరీ టారిఫ్ వ్యవస్థ అమలులోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు వెళ్లే వస్తువులపై అదనపు సుంకాల ముప్పు ఏర్పడుతుంది.

అలాంటి పరిస్థితి ఏర్పడితే ప్రభావం కేవలం చమురు రంగానికే పరిమితం కాకుండా భారత్-అమెరికా వాణిజ్యం, ఎగుమతులు, కంపెనీల వ్యయాలు, సరఫరా గొలుసులు వంటి అంశాలపై కూడా పడే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో అమెరికాలోని కొంతమంది చట్టసభ సభ్యులు కూడా అధ్యక్షుడికి ఇంత విస్తృతమైన టారిఫ్ అధికారాలు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇక ముందేం జరుగుతుంది?

ప్రస్తుతం కీలకమైనది హౌస్‌లో జరగబోయే తుది ఓటింగ్. హౌస్ ఆమోదం తర్వాత బిల్లు చట్టంగా మారేందుకు తదుపరి రాజ్యాంగపరమైన ప్రక్రియ పూర్తవ్వాలి. ఆ తర్వాతే అధ్యక్షుడికి లభించే అధికారాలు.. వాటిని భారత్ వంటి దేశాలపై ఎప్పుడు, ఎలా ఉపయోగిస్తారన్నది స్పష్టమవుతుంది.

అందుకే ప్రస్తుత పరిణామాన్ని "భారత్‌పై 100% టారిఫ్ అమల్లోకి వచ్చింది"గా చూడటం కంటే "భారత్‌పై 100% వరకు టారిఫ్ విధించే అధికారానికి అమెరికా చట్టసభలో మార్గం ఏర్పడుతోంది"గా చూడటం సరైనది. తుది ఓటింగ్, బిల్లులోని తుది నిబంధనలు, అధ్యక్షుడి నిర్ణయం.. ఈ మూడు దశలే భారత్‌పై వాస్తవ ప్రభావాన్ని నిర్ణయించనున్నాయి.

భూవివాదం.. మోదీ స్కూల్‌మేట్‌కు దక్కిన ఊరట

ఆయన ఆరోపించారు. ఈ రెండు సంస్థలతో భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధం ఉందని తెలిపారు. ఈ విషయం పై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

2015లో పోలీసులు దీనిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా.. దాదాపు 11ఏళ్ల తర్వాత ఇటీవల కోర్టుకు నివేదిక సమర్పించారు. మరోవైపు, ఈ వ్యవహారానికి సంబంధించి గతేడాది ఆ రెండు సంస్థలు.. వోహ్రాపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో మనస్తాపానికి గురైన

మొదటిపేజీ తరువాయి

అస్టర్‌అలీ వోహ్రా.. సెప్టెంబరు 8న ప్రధాని మోదీని కలిసి తన ఆవేదనను విన్నవించుకున్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని అభ్యర్థించారు. కాగా.. సెప్టెంబరు 16న ఈ కేసుపై మున్సిపల్ కార్పొరేషన్‌లో విచారణ జరగాల్సి ఉంది. ఆ లోగానే కేసు పరిష్కారమైనట్లు తెలిసింది. వోహ్రాతో భూవివాదం నుంచి ఆ రెండు సంస్థలు వెనక్కి తగ్గాయి. ఆయనకు భూమిని తిరిగిచ్చేందుకు అంగీకరించడంతో పాటు కేసును ఉపసంహరించుకున్నాయి. గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో గల బీఎన్ స్కూల్‌లో వోహ్రా చదువుకున్నారు. ఇదే పాఠశాలలో మోదీ కూడా విద్యనభ్యసించారు.

పవన్ ఛాన్స్ తీసుకోవాల్సిందేనా ?

సీట్లను వంద శాతం స్ట్రైక్ రేట్ తో గెలుచుకుంటారు అని అంటున్నారు. అయితే ఈ విషయం పైకి చెప్పినట్లుగా సింపుల్ గా కనిపిస్తున్నా అన్ని పార్టీలకీ క్యాడర్ తోనే సమస్య. పైగా టీడీపీ నూరు శాతం సీట్లలో పోటీ చేయగల సత్తా ఉన్న పార్టీ. దాంతో ఆ పార్టీలో దీని మీద ఏ మేరకు అంగీకారం కుదురుతుంది అన్నదే కీలక పాయింట్.

అయిననూ కోరాల్సిందే :అయితే టీడీపీ విషయంలో తమ్ముళ్ల ఆకాంక్షలు ఆలోచనలు ఎలా ఉంటాయి అన్నది పక్కన పెడితే జనసేన 2024లో కొన్ని త్యాగాలు చేసింది కాబట్టి ఆ పార్టీ ఇప్పుడు కచ్చితంగా సీట్లు అడిగి తీసుకోవాల్సిందే అని అంటున్నారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ కచ్చితంగా వాటా సాధించాల్సిందే అని అంటున్నారు. గతంలో మాదిరిగా మొహమాటాలకు పోతే అది జనసేనకు ఇబ్బందికరంగా మారుతుంది అని అంటున్నారు. దాని కంటే మించి జనసేన సంస్థాగతంగా మరింతగా బలపడాలి అంటే సరైన పునాది ఇపుడే పడాలని అంటున్నారు.

సర్దుబాటులోనే : కూటమిలో ఐక్యతను కాపాడుకుంటూనే సర్దుబాటులో పయనించాలి అంటే మధ్యే మార్గాలు ఏమైనా ఉన్నాయా అన్నది కూడా ఆలోచించాల్సి ఉంది. అయితే ఇపుడు అలాంటివి కుదిరే వ్యవహారం ఉందా అన్నది మరో చర్చ. ఎందుకంటే ముప్పై శాతం సీట్లు తమకు కావాలని జనసేన బాహాటంగా ఒకసారి చెప్పిన తరువాత వెనక్కి వెళ్తే అది క్యాడర్ లో నిరుత్సాహాన్ని కలిగిస్తుంది అని అంటున్నారు. అందువల్ల కూటమి పెద్దలతో సర్దుబాటు వేళ ఎలాంటి దిద్దుబాట్లు లేకుండా అనుకున్న సీట్లను సాధించుకుని వస్తే కచ్చితంగా జనసేన మరింత స్ట్రాంగ్ గా నిలిచిపోతుంది అని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి జనసేన బలంగా మారి ఆ పార్టీకి మంచి భవిష్యత్తుని కూడా ఇస్తుంది అని అంటున్నారు. దాంతో పవన్ చాన్స్ తీసుకోవాల్సిందే అన్నదే గట్టిగా వినిపిస్తోంది.

భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక

దౌత్యమార్గాల ద్వారా కేంద్రం ఈ ఘటనను లేవనెత్తింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఇరుదేశాల మధ్య ఒప్పందాల్లోని నిబంధనలు గౌరవించేలా సంబంధిత పాక్ అధికారులకు తెలియజేయాలని సూచించింది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఈ ఘటనను లేవనెత్తాలని ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యవేత్తకు వెల్లడించింది.

ఈ ఘటన జరిగిన సమయంలో అరేబియా జలాల్లో భారత నౌక గస్తీ నిర్వహిస్తోంది. భారత్‌వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పాక్ నౌక హునైన్ క్లాస్‌కు చెందినదని, భారత్‌ది యుద్ధనౌక అని వెల్లడించాయి. ఆ సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఘటన తర్వాత రెండు నౌకలు దూరంగా వెళ్లాయని చెప్పాయి. కాగా.. 2011లో పాక్ నేవీకి చెందిన బాబర్, ఐఎన్ఎస్ గోదావరి మధ్య ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.

రావాలి అవంతి అంటున్న వైసీపీ !

అన్న దాని మీద పార్టీ అంతర్గత సర్వే నిర్వహిస్తే మెజారిటీ క్యాడర్ తో పాటు నాయకులు అంతా అవంతికి జై కొట్టారని తెలుస్తోంది. అవంతి 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేశారు. విశాఖ వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఆయన ఉన్నారు. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు అంగబలం అర్ధ బలానికి లోటు లేదు. ఇక 2009లో ప్రజా రాజ్యం నుంచి ఒకసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలా ఆయనకంటూ సొంత బలం అనుచర గణం ఉంది. అందువల్ల ఆయనకే పార్టీ బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో కూటమిని ఢీటుగా ఎదుర్కొంటారు అని అంటున్నారు. ఇది భీమిలీ మెజారిటీ వైసీపీ నేతల మాటగా ఉంది.

ఇంతకీ ఆయన వస్తారా : అయితే ఇదంతా ఒంటి చేతి చప్పుడు మాదిరిగానే ఉంది అంటున్నారు. వైసీపీ తన సర్వేలు తాను చేస్తోంది. అందులో అవంతి పేరు కూడా జోడించింది. అందరూ అవంతి కావాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ ఇంతకీ అవంతి శ్రీనివాసరావు వైసీపీలోకి తిరిగి చేరుతారా అన్నదే పెద్ద చర్చగా ఉంది. ఆయన 2024 డిసెంబర్ లో వైసీపీకి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన ఆలోచనలు కూటమిలో చేరాలని. అందుకే వైసీపీ మేయర్ ని దించడానికి కార్పోరేటర్ గా ఉన్న తన కుమార్తె చేత కూడా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించి టీడీపీ కూటమికి జీవీఎంసీ దక్కేలా చేశారు. అయితే టీడీపీలో ఆయన రాకను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకించడంతో ఆగింది అని అంటున్నారు.

తగిన మూల్యం చెల్లిస్తోంది :

జనసేనలో ఆయనను చేర్చుకోవడానికి కూడా స్థానికంగా అంగీకారం లేదని చెబుతున్నారు. ఈ కారణాల వల్లనే ఆయన ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు అని అంటున్నారు. డీలిమిటేషన్ మీద అవంతి ఆశలు పెట్టుకున్నారు. సీట్లు పెరిగితే కనుక కూటమి పార్టీలలో చేరి మళ్ళీ పోటీ చేయాలని చూస్తున్నారు. ఈ నేపధ్యంలో అవంతి వైసీపీలో చేరుతారు అన్నది ఎంతవరకూ జరుగుతుంది అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఒకవేళ మనసు మార్చుకుని అవంతి వైసీపీలో చేరితే మాత్రం వైసీపీకి గండం గట్టెక్కినట్లే అంటున్నారు. మొత్తానికి చూస్తే గతంలో వైసీపీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. కానీ ఎన్నికల వేళ వారిని అందరినీ దూరం చేసుకున్న పాపానికి ఇపుడు వైసీపీ తగిన మూల్యం చెల్లిస్తోంది అని అంటున్నారు.

జగన్ రాజకీయం చెయ్...

కూడా ఆయన గమనిస్తూ ఉండాలని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ నాయకుడి చెవికి చేరాలి. అయితే వైసీపీలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఎన్నో అంచెలను వైసీపీలో ఏర్పాటు చేశారు. వాటిని దాటుకుని జగన్ ని చేరడం కష్టం అవుతోంది అని అంటున్నారు. అధికారంలో ఉన్నపుడు కూడా జగన్ అపాయింట్మెంట్ చాలా మంది పెద్దలకే దొరకడం కష్టంగా మారింది అని చెబుతారు. ఇప్పుడు ఓడిన తరువాత కూడా అంతే అన్నట్లుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

పార్టీని నమ్ముకుని :ఒక రాజకీయ పార్టీని ఎవరైనా స్థాపించవచ్చు. అయితే ఆ పార్టీని నమ్ముకుని ఎంతో మంది చేరుతారు. వారి ఆకాంక్షలు అన్నీ కూడా పార్టీ అధినాయకత్వం పార్టీ నడిపే తీరుని బట్టే నెరవేరే అవకాశం ఉంది. అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఆమోదయోగ్యమైన తీరులో పార్టీని నడిపితేనే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. పార్టీ తీరుని మార్చుకునేందుకు నిరంతరం సమీక్షలు కూడా అవసరం అని అంటున్నారు. ఇదిలా ఉంటే వర్గ పోరు ప్రతీ జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఉంది. దాంతో వైసీపీ బలంగా ఉన్న చోట కూడా వీక్ అయిపోతోంది అని అంటున్నారు.

అధినాయకత్వం జోక్యంతో :శ్రీకాకుళం జిల్లాలో చూస్తే ధర్మాన సోదరులే జిల్లా పార్టీ మీద మొత్తం పెత్తనం చేస్తున్నారు అని తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదని ఆయన అంటున్నారు. ఇలా రెండు కీలక వర్గాలు రెండు సామాజిక వర్గాల మధ్య వైసీపీ జిల్లాలో చీలిపోయి అవస్థలు పడుతోంది. వైసీపీ అధినాయకత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అని అంటున్నారు.విజయనగరం జిల్లాలో కూడా అసంతృప్తి తారస్థాయికి చేరిన మీదటనే చిన్న శ్రీను పార్టీని వీడారని గుర్తు చేస్తున్నారు. ఇపుడు శ్రీకాకుళంతో పాటు అనేక జిల్లాలలో ఇదే రకమైన వాతావరణం ఉందని అంటున్నారు.

రాజకీయమే చేయాలి : రాజకీయం అనేది ఒక క్రీడ. ఇక్కడ ఎవరికి నచ్చినట్లుగా వారు ఆడడానికి లేదు. ఈ ఆటకు సిద్ధపడితే ప్రత్యర్ధి వ్యూహాలను ఎత్తులను గమనించి దానికి తగినట్లుగా పై ఎత్తులు వేయాలి. అంతే స్థాయిలో రాజకీయం చేయాలి. అలా కాదు అని మడి కట్టుకుని కూర్చుంటే రాజకీయం ఎప్పటికీ పండదని అంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కొడాలి నాని కూడా జగన్ విషయంలో మాట్లాడుతూ ఆయన రాజకీయ నాయకుడు కారు అనేశారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టుకుని నడుపుతున్నారని చెప్పారు. అలా అనుకుంటే వైసీపీ రాజకీయ క్షేత్రంలో ప్రత్యర్ధి వేసే ఎత్తులకు చిత్తు అవుతూనే ఉంటుంది అన్నది కూడా సీనియర్ల మాటగా ఉంది. జగన్ తీరు మారాలని అంటున్నారు. ముల్లుని ముల్లుతోనే కోయాలి అన్నట్లుగా ఏపీలో రాజకీయానికి తగిన విధంగా వైసీపీ కూడా ధీటుగా స్పందించాలని కోరుతున్నారు.

బీజేపీకి యూసీసీ చిక్కులు.. ఏపీ మాటేంటి?

ఏంటీ యూసీసీ.. యూసీసీ అంటే.. యూనిఫాం సివిల్ కోడ్(ఉమ్మడి పౌర స్మృతి). అంటే.. భారత్‌లో నివసించే పౌరులు అందరికీ ఒకే విధమైన చట్టం వర్తించడం. ఉదాహరణకు ముస్లింలకు వివాహానికి సంబంధించి షియా చట్టాలు అమలులో ఉన్నాయి. కానీ, ఇప్పుడు యూసీసీ అమలైతే.. వారంతా దానికిందకే వస్తారు. అలానే వారసత్వ హక్కులు కూడా ఇతర మతాల్లో భిన్నంగా ఉన్నాయి. యూసీసీతో అవి కూడా ఏకీకృతం అవుతాయి. మతంతో సంబంధం లేకుండా దేశంలోని పౌరులందరికీ వివాహం, విడాకులు, ఆస్తి వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత విషయాలలో ఒకే విధమైన సమాన చట్టాలను వర్తింపజేసే విధానం.

షా ఏమన్నారు? : వచ్చే 2029 ఎన్నికల నాటికి దేశంలోని అన్ని ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో(ఏపీ కూడా ఉంది) యూసీసీని ఖచ్చితంగా అమలు చేస్తామని అమిత్ షా తాజాగా ముంబైలో ప్రకటించారు. ఆ వెంటనే ఈ వ్యవహారం రాజకీయ చర్చకు, రచ్చకు కూడా దారితీసింది. దీనిని తాము వ్యతిరేకిస్తున్నట్టు.. బీజేపీ మిత్రపక్షంగా ఉన్న బీహార్ అధికార పార్టీ జేడీయూ ప్రకటించింది. దీనినిప్రజలు వ్యతిరేకిస్తున్నారని.. ప్రజల విశ్వాసాన్ని తాము పరిగణనలోకి తీసుకుంటామ ని ప్రకటించింది. దీంతో తొలి దెబ్బ బీహార్ నుంచే ప్రారంభమైంది. ఇక, కాంగ్రెస్ పార్టీ యూసీసీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అలానే, పంజాబ్, యూపీలలోని ముస్లింలు కూడా దీనిని వ్యతిరేకిస్తున్నారు.

ఏపీ సంగతేంటి?

ఏపీలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి(ఎన్డీయే) ప్రభుత్వమే ఉంది. అమిత్ షా ప్రకటన ప్రకారం ఏపీలోనూ యూసీసీని వచ్చే ఎన్నికల నాటికి అమలు చేయాల్సి వస్తే.. దీనికి చంద్రబాబు అంగీకారం తెలుపుతారా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. మతపరమైన ముస్లిం ఓటుబ్యాంకు 12 శాతంగా ఉంది. కర్నూలు, గుంటూరు, అనంతపురం, విజయవాడ సహా.. పలు ప్రాంతాల్లో ముస్లింలు కీలక రాజకీయ నేతలుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏపీలో కూటమి సర్కారుకు ఈ వ్యవహారం అగ్నిపరీక్షగా మారుతుందన్న చర్చ సాగుతోంది. మరి ఏం చేస్తారో చూడాలి.

మార్కాపురం జిల్లా అభివృద్ధికి "విద్యార్థులతో ముఖాముఖి" మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 16)

పట్టణంలోని జవహర్ నగర్ లోని సాధన డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులతో మార్కాపురం జిల్లా అభివృద్ధికి " విద్యార్థులతో ముఖాముఖి" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుండి మార్కాపురం జిల్లా అభివృద్ధికి చేయవలసిన పలు సూచనలు, సలహాలు స్వీకరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో ముఖ్యంగా విద్యార్థిని, విద్యార్థులు ఈవ్ టీజింగ్, మార్కాపురం పట్టణంలోని మౌలిక సదుపాయాల గురించి ఆసక్తిగా కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు. వారి ప్రశ్నలను సావధానంగా విన్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎంతో ఓపికతో ప్రతి ప్రశ్నకు సమాధానాలు ఇచ్చారు. భవిష్యత్తులో మార్కాపురం ఏ రకంగా అభివృద్ధి చెందబోతుంది అని విపులంగా వివరించారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం గౌరవ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.









అన్నా రాంబాబు మంత్రి కావాలని విఘ్నేశ్వరుడికి మొక్కు

రూ.37,000లకు లడ్డూ కైవసం చేసుకున్న మందగిరి రమేష్ యాదవ్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 16)

పొదిలి పట్టణంలోని 5వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాట ఉత్సాహంగా సాగింది. ఈ పోటీ పాటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పట్టణ అధ్యక్షుడు మందగిరి రమేష్ యాదవ్ రూ.37,000లకు స్వామివారి దివ్య ప్రసాద లడ్డూను కైవసం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న అనంతరం రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్సీపీ పార్టీ రాష్ట్రంలో అఖండ మెజార్టీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అదే విధంగా నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు భారీ మెజార్టీతో విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టి మంత్రి పదవి చేపట్టాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు.









షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
17.09.26 గురువారం

18న ' మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ' ట్రైల్ రన్

సిబ్బంది మోహరింపు, ప్రజలకు అవగాహన పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 16)

ఈ నెల 19వ తేదీన నిర్వహించే ' మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ' లో భాగంగా శుక్రవారం ట్రైల్ రన్ నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్ళు అవుతున్న సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమం ' వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ' లో నిలిచేలా చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో 80 వేలకు పైగా ఇళ్ళు ఉన్నాయని, తడి చెత్తను, పొడి చెత్తను ఇంటి వద్దే వేరువేరుగా వేసేలా ప్రతి ఇంటికీ ప్రత్యేక నంబర్లతో కూడిన 2 బయోడీగ్రేడబుల్ కవర్లను మున్సిపల్ అధికారులు గురువారం సరఫరా చేస్తారు. తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేయాల్సిన ఆవశ్యకతను, ఈ ' మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ' లక్ష్యాలను, ఒంగోలు మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకల వివరాలతో కూడిన కరపత్రాలను కూడా అందిస్తారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ వ్యాప్తంగా ఒక గంట పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందికి సహాయం చేసేలా మెప్మా సభ్యులను కూడా వినియోగించుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఒంగోలు పారిశుధ్య కార్మికులకు అదనంగా సమీప మండలాలలోని పంచాయతీ కార్మికులను కూడా ఈ విధులకు ప్రత్యేకంగా తరలించాలని చెప్పారు. సేకరించిన చెత్తను రవాణా చేసేందుకు అవసరమైన వాహనాల మోహరింపు, వాటికి నిర్దిష్ట సిబ్బంది కేటాయింపు, శానిటేషన్ డివిజన్ల వారీగా ఈ డ్రైవ్ పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయి అధికారులను కూడా కేటాయిస్తున్నట్లు (తరువాయి 4లో...)

చెరువులకు జలకళ.. గ్రామాలకు నీటి భరోసా

నీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రత్యేక కార్యాచరణ
ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్పీ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయం
ఎమ్మెల్యే ఏలూరి కృషికి చెరువులు జలకళే నిదర్శనం



పెద్ద చెరువులను నింపేలా సాగర్ జలాలు అందించాలని కోరారు.

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టంబర్ 16)

వేసవి ముంగిటే బీటలు వారే చెరువులు.. బిందెడు నీటి కోసం మైళ్ల దూరం పరుగులు తీసే గ్రామస్తులు.. ఇదొకప్పటి పరిస్థితి. దానికి భిన్నంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో పలు గ్రామాల్లో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేశారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఎన్ఎస్పీ శాఖల సమన్వయంతో ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా రంగంలోకి దిగారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే గ్రామాల్లో తిరిగి నీటి సమస్యను స్వయంగా అధ్యయనం చేసి, ఏ ఊరికి ఎక్కడి నుంచి నీరు అందించాలో, ఏ చెరువు నింపితే చుట్టుపక్కల గ్రామాలకు మేలు జరుగుతుందో సమగ్రంగా ప్రణాళిక సిద్ధం చేశారు. అధికార యంత్రాంగంతో అడుగడుగునా సమన్వయం చేసుకుంటూ ఆ ప్రణాళికను ఆచరణలో పెట్టడంతో ఇవాళ నియోజకవర్గంలోని పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

గ్రామాల వారీగా సమస్యల గుర్తింపు.. పరిష్కారానికి కార్యాచరణ

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తాగునీటి పరిస్థితిపై ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక దృష్టి సారించారు. నీటి వనరులు, చెరువులు, కాలువలు, తాగునీటి పథకాల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కడ నీటి కొరత తీవ్రంగా ఉంది? ఏ చెరువును నింపితే భూగర్భ జలమట్టం పెరుగుతుంది? ఏ గ్రామానికి ఏ నీటి వనరు ఉపయోగపడుతుంది? అనే కోణాల్లో అధ్యయనం చేశారు. దీనికి అనుగుణంగా ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్పీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమన్వయం చేస్తూ గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించారు. అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన చోట్ల నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టారు.

సాగర్ జలాలతో చెరువులకు జీవం

సాగర్ జలాల లభ్యతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంపై ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆ నీటిని చెరువులకు మళ్లించడం ద్వారా ఒకేసారి తాగునీటి అవసరాలకు భరోసా కల్పించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా ఎండిపోయిన స్థితిలో ఉన్న పలు గ్రామాల చెరువులు నేడు నీటితో కళకళలాడుతున్నాయి.

మరో వారం సాగర్ నీరు ఇవ్వాలని సీఎం దృష్టికి

సాగర్ జలాల విడుదలను మరో వారం రోజులపాటు పొడిగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. మరికొంతకాలం సాగర్ జలాలు అందుబాటులో ఉంటే నియోజకవర్గంలోని మరిన్ని చెరువులను నింపవచ్చని, తద్వారా రానున్న రోజుల్లో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు భరోసా కల్పించవచ్చని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఆదేశిస్తూ చెరువులు నింపేలా చర్యలు

మార్కూరు మండల పరిధిలోని మార్కూరు చెరువును నింపాల్సిన ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరిస్తూ ఆ దిశగా క్షేత్రస్థాయిలో చెరువును ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా పరిశీలించి, నింపేలా చర్యలు చేపట్టారు. అలాగే రాజుపాలెం మేజర్ కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలించి రాజుపాలెం, జొన్నతాళి చెరువులను నింపేలా కీలక ఆదేశాలు జారీ చేశారు. బొబ్బేపల్లి, రాజుగారుపాలెం, ద్రోణాదుల చెరువులను నింపేలా ఆయా శాఖల అధికారులతో ప్రతినిత్యం పర్యవేక్షించారు. యద్దనపూడి, గన్నవరం, పోలూరు, శ్యామలవారిపాలెంలో మోటార్లు ఏర్పాటు చేయించి చెరువులు నింపేలా చొరవ చూపారు. నూతలపాడు, పర్చూరు చెరువులకు మొదటి రోజు నుంచే నీరు నింపేలా ప్రణాళికలు రూపొందించారు. పర్చూరు, వీరన్నపాలెం చెరువులను శుభ్రం చేయించి సాగర్ జలాలతో నింపేలా చొరవ చూపారు. దేవరపల్లి, ఏడారిపల్లి, చింతగుంటపాలెం, నూతలపాడు, నాగులపాలెం, గోరంట్లవారిపాలెం, తిమ్మరాజుపాలెం, కొల్లావారిపాలెం, పెద్దివారిపాలెం చెరువులను నింపేలా చర్యలు చేపట్టారు. ఇంకొల్లు మండలంలో కొనికి చెరువును పూర్తిస్థాయిలో నింపేలా ఆదేశాలు జారీ చేశారు.

నీటి సమస్య కనిపిస్తే.. పరిష్కారం దిశగా అడుగులు


గ్రామాల్లో నీటి సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే గుర్తించి అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలన్నదే ఏలూరి కార్యాచరణలోని ప్రధాన ఉద్దేశం. గ్రామాల వారీగా పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, సంబంధిత శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు చేపడుతున్నారు. పర్చూరు నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే ఏలూరి చేస్తున్న నిరంతర కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

భూములకు ఖచ్చితత్వంతో సరిహద్దులు నిర్ణయించుటమే రీసర్వే ముఖ్య ఉద్దేశం



మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

బంజరు బీడు భూములను ఆదాయ వనరుగా మార్చడం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 16)

సాగులో లేని బంజరు బీడు భూములను కూడా ఆదాయ వనరుగా మార్చటంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ తీరు, సేద్యం చేయకుండా వదిలేసిన భూములపై సమీక్షించారు. రెగ్యులరుగా ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసే భూములు కాకుండా వినియోగంలో లేని బంజరు బీడు భూములపై ఆరా తీశారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్న నేపథ్యంలో రైతులకు, పశు పోషకులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలన్నారు. వినూత్న విధానాలను అమలు చేయడం ద్వారా వారి ఆదాయం పెరిగేలా దృష్టి సారించాలన్నారు. బంజరు బీడు భూములలో గడ్డి, ఇతర పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఆదాయంతో వారి జీవీఏ పెంచవచ్చన్నారు. ఈ దిశగా బంజరు బీడి భూములను గుర్తించి భూయజమానులతో మాట్లాడి కమ్యూనిటీ ఫార్మింగ్ దిశగా ముందుకు వచ్చేలా చూడాలన్నారు. వాతావరణంలో వేడిని తగ్గించేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఈ విధంగా గడ్డి, ఇతర పండ్ల మొక్కలను పెంచేందుకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల కేటాయింపు పై రాజకీయ పార్టీల నాయకులతో చర్చ
తాజా ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి
రాజకీయ పార్టీల ప్రతినిధులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 16)

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల లొకేషన్లు, ఓటర్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు తదితర అంశాల పై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం మార్కాపురం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి డీఆర్వో ఎం వెంకట శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చర్చించారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు, పోలింగ్ కేంద్రాల ఎంపిక, ఓటర్లను ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించే విధానం, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సౌకర్యాల కల్పనపై సమావేశంలో వివరంగా చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, ఇతర అవసరమైన సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలకు సంబంధించిన ఎంపీటీసీ స్థానాల పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఆయా గ్రామాల ప్రస్తుత పరిస్థితులు, ఓటర్లకు అందుబాటులో ఉండే ప్రదేశాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాజకీయ పార్టీల నాయకులు (తరువాయి 4లో...)





భూములకు ఖచ్చితత్వంతో సరిహద్దులు నిర్ణయించుటమే రీసర్వే ముఖ్య ఉద్దేశం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 16)

భూములకు ఖచ్చితత్వంతో సరిహద్దులు నిర్ణయించడమే రీసర్వే ముఖ్య ఉద్దేశ్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయ ణరెడ్డి అన్నారు. బుధవారం మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో రీ సర్వే గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కండపురాయికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతు పట్టాదారు పాసు పుస్తకాల పై జగన్ బొమ్మ ముద్రించుకున్నారని, దాంతో రైతుల్లో తెలియని అయోమయం, గందరగోళం, భయం కూడుకున్నదన్నారు. దాన్ని తొలగించడమే ధ్యేయంగా ఇప్పుడు గ్రామాల్లో కచ్చితత్వంతో భూములకు రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వ రాజ ముద్రతో ముద్రించి ఇస్తారన్నారు. ఈ ప్రాంతం వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోకి వస్తుందని, తద్వారా ఈ ప్రాంతంలో పండ్ల మొక్కలు అభివృద్ధి చేసి హార్టికల్చర్ హబ్ గా తయారు చేద్దాం అని అన్నారు. ఇది రైతు ప్రభుత్వం అని ఈ ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, రెవిన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంజరు బీడు భూమితోనూ ఆదాయం
జీవీఏ పెంపు పై జిల్లా యంత్రాంగం దృష్టి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 16)

సాగులోలేని బంజరు బీడు భూములను కూడా ఆదాయ వనరుగా మార్చటం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ తీరు, సేద్యం చేయకుండా వదిలేసిన భూముల పై సమీక్షించారు. రెగ్యులరుగా ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసే భూములు కాకుండా వినియోగంలో లేని బంజరు బీడు భూములపై ఆరా తీశారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్న నేపథ్యంలో రైతులకు, పశు పోషకులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలన్నారు. వినూత్న విధానాలను అమలు చేయడం ద్వారా వారి ఆదాయం పెరిగేలా దృష్టి సారించాలన్నారు. బంజరు బీడు భూములలో గడ్డి, ఇతర పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఆదాయంతో వారి జీవీఏ పెంచవచ్చన్నారు. ఈ దిశగా బంజరు బీడి భూములను గుర్తించి భూయజమానులతో మాట్లాడి కమ్యూనిటీ ఫార్మింగ్ దిశగా ముందుకు వచ్చేలా చూడాలన్నారు. వాతావరణంలో వేడిని తగ్గించేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఈ విధంగా గడ్డి, ఇతర పండ్ల మొక్కలను పెంచేందుకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన వేడుకలతో సందడిగా చిన్నగంజాం సముద్రతీరం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 16)

చిన్నగంజాం గణేష్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకలతో చిన్నగంజాం మండల పరిధిలోని ప్రధాన బిచ్ లైన పెదపల్లేపాలెం, మోటుపల్లి, పెదగంజాం సముద్రతీరాలు అత్యంత సందడిగా మారాయి. నిమర్జినం సందర్భంగా మండలంతో పాటు ఇతర మండలలా భక్తులు భారీ ఎత్తున గణపతులతో తరలివచ్చి గణపతి బప్పా మోరియా అంటూ గణనాథుడి విగ్రహాలను సముద్ర గర్భంలో నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ రామ్ నాయక్ అధ్వర్యంలో ఎస్ఐ రమేష్ భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పకడ్బంది ఏర్పాట్లు



అధికారులను కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, తాజా జాబితా ఆధారంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని వారు సూచించారు. మార్కాపురం జిల్లాలో జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 990 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు సమావేశంలో తెలిపారు. అదేవిధంగా జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి జిల్లాలో మొత్తం 7,55,731 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలకు అవసరమైన సమాచారం అందిస్తూ, అన్ని నిబంధనలను పాటిస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ పద్మావతి, ఎన్నికల విభాగం అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

18న ' మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ' ట్రైల్ రన్



కలెక్టర్ తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా జరిగేలా చూడాలన్నారు. ఇందుకోసం శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఆయా విషయాలను తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లేలా అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా గురువారం అవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో డ్రైవ్ పర్యవేక్షకులుగా ఉన్న ఐదుగురు జిల్లాస్థాయి అధికారులైన జడ్పీ సీఈవో చిరంజీవి, మెప్మా పిడి నారాయణ, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ తోపాటు డీఈవో రేణుక, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, అసిస్టెంట్ కమిషనర్ నగేష్, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్‌కు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి
జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 16)

రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు మరో రెండు రోజులు గడువు పెంచిందని తదనగుణంగా అర్హులైన వారందరి నుంచి దరఖాస్తు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుండి మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మరో రెండు రోజులు దరఖాస్తుల స్వీకరణకు అనుమతించిన నేపథ్యంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో వెరిఫై చేయాలని ఆయన అన్నారు. ప్రత్యేక కేటగిరీ కింద వచ్చే అప్లికేషన్లను ఆయా శాఖల వారి అనుమతులు తీసుకొని వెరిపై చేయాలని ఆయన సూచించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి నాలుగు రకాల పింఛన్లనుకు దరఖాస్తులు ప్రస్తుతం తీసుకోవడం జరుగుతుందని బోదకాలు క్రానికల్ డిసీజెస్ లెప్రసీ కిడ్నీ లివర్, హృదయ మార్పిడి వంటి వాటికి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తీసుకోవాలన్నారు. ప్రతివారం జిల్లాస్థాయిలో, ప్రజా ప్రతినిధులు, మంత్రులు నిర్వహించే ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఎక్కువ శాతం పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు అందుతుంటాయని ఆయన తెలిపారు. ప్రలోభాలకు తావు ఇవ్వకుండా మండలాధికారులు దరఖాస్తులను కచ్చితంగా ఖచ్చితత్వంతో పరిశీలించాలన్నారు.. అశ్రద్ధ వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు అందేలా చూడాలన్నారు. పింఛన్ల మంజూరు విషయంలో ప్రతికూల వార్తలు లేకుండా చూడాలన్నారు. పింఛను మంజూరు అనేది జీవితాంతం ఇచ్చే ఆర్థిక భరోసా అని ఆయన అన్నారు. ఎల్నినో ప్రభావంతో మంచినీటి కొరత ఏర్పడకుండా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని మరమ్మత్తులు కావలసిన బోర్లకు వెంటనే మరమ్మతులు చేసి మంచినీటిని అందించాలన్నారు. త్రాగునీరు అందించే విషయంలో మండల పరిషత్ అధికారులు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పి డి నారాయణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిరంజీవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు సచివాలయాల అధికారి వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళ, వికలాంగుల పెన్షన్లకు నెల రోజులు గడువు పొడిగించాలి
సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 16)

వితంతు వృద్ధాప్య ఒంటరి మహిళ వికలాంగుల పెన్షన్లు నియమిత గడువు నెల రోజులు పొడిగించాలని సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమైనది. కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్ రద్దు వలన మరి కొంత మంది పెన్షన్లకు అర్హత పొందిన వారు చాలామంది ఉన్నారు. గత కొంతకాలంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ వలన అనేకమంది అర్హత ఉన్నా రేషన్ కార్డులో డిలేటింగ్ ప్రక్రియ లేకపోవడం వలన అర్హత ఉన్నా పెన్షన్ రాకుండా ఆగిపోయినవి. ప్రస్తుతం తక్కువ టైంలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విధానం పెట్టిన తర్వాత కొంత గడువు ఇవ్వాల్సిన అవసరం ఉందని, గత కొంత కాలంగా వికలాంగుల పెన్షన్ల కొరకు సదరన్ సర్టిఫికెట్లు కూడా ఆపడం జరిగిందన్నారు. ఒంటరి మహిళ అప్లై చేసుకునేందుకు కావలసిన పత్రాలు సమకూర్చుకునేందుకు కొంత గడువు అవసరమని, వీటన్నిటినీ పరిగణలో తీసుకొని పెన్షన్ అప్లై చేసుకునేందుకు గడువును పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా పోషన్ మహా 2026



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, సెప్టంబర్ 16)

పోషన్ మహా 2026 కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమరోలు అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నాయుడుపాలెం సూపర్వైజర్ కెవి సుబ్బమ్మ హాజరై అధ్యక్షత పహించారు.ముందుగా మన అంగన్వాడీ మన బాధ్యత అనే కార్యక్రమం పై గర్భవతులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు. వారితో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో వేడి భోజనం పై ఆమె అవగాహన నిర్వహించారు. దగ్గరుండి వేడి భోజనం పై గర్భవతులకు, బాలింతలకు వండిన భోజనం చూపించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షార్ట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గురవయ్య, ఏఎన్ఎం నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, లక్ష్మీ బాయి, పోలమ్మ, ఆశా వర్కర్లు జ్యోతి, కొండమ్మ, గర్భవతులు, బాలింతలు , పిల్లలు, పాల్గొన్నారు.

గర్భిణీలు పోషక విలువల కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 16)

మండలంలోని చౌటపాలెం సింగరభట్లపాలెం లింగంగుంట గ్రామాలలో బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. రిజ్వానా మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థ తీసుకోవాలని తెలిపారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పి సునీత, శైలజ, వాణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద మంచినీటి హ్యాండ్‌పంపులు ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టెంబర్ 16)
ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సచివాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లారెడ్డిపాలెంలో రెండు మంచినీటి హ్యాండ్‌పంపులను ఏర్పాటు చేశారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్దులూరి మహేందర్‌నాథ్ సూచనల మేరకు ప్రజల విజ్ఞప్తితో చల్లారెడ్డిపాలెం టీడీపీ అధ్యక్షుడు కీర్తి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సచివాలయం 1, జబ్బర్ కాలనీ సమీపంలోని సచివాలయం 2 వద్ద వీటిని ఏర్పాటు చేశారు. హ్యాండ్‌పంపుల ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొండయ్య, మద్దులూరి మహేంద్ర నాథ్, గ్రామ టిడిపి అధ్యక్షులు కీర్తి పూర్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల జాబితా పై రాజకీయ పార్టీలతో సమావేశం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 16)
మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపిడిఓ కె ధనలక్ష్మి బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21 లోగా ఈ ప్రక్రియ సజావుగా సాగేలా సిబ్బందికి సహకరించాలని అమే కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల వేతనం బోనస్

రెండు జతలు బట్టలు ఇవ్వాలని కమిషనర్ వెంకట కృష్ణయ్యకి వినతి పత్రం అందజేత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 16)
ఒంగోలు మున్సిపాలిటీ 150 సంవత్సరాల సందర్భంగా వేడుకలు సాంస్కృతి కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరిగే నేపథ్యంలో పారిశుధ్య కార్మికులకు అందరికీ ఒక నెల వేతనం బోనస్, రెండు జతలు బట్టలు ఇవ్వాలని నగర కార్పొరేషన్ కమిషనర్ కె వెంకట కృష్ణయ్య ని యూనియన్ తరపున అర్జీ ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా 150 సంవత్సరాలు వేడుకలు నెల రోజుల పాటు సాంస్కృతి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఒంగోలు నగర అభివృద్ధిగా, సుందరంగా, రోడ్లు, వీధులు, పరిసరాలు, పరిశుభ్రంగా చేస్తూ పర్యావరణం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికులు శ్రమ చాలా కీలకమైనదన్నారు. ఇల్లు లేని పారిశుధ్య కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, దాదాపు 25 సంవత్సరాల నుండి కార్మికులు నివాసం ఉంటున్న ధారావారికుంట, పీర్ల మన్యం లో కార్మికులకు ఇల్లు పట్టాలు ఇవ్వాలని, కనీసం మాలిక సదుపాయాలు కల్పించాలని. కోవిడ్ కార్మికులకు అందర్నీ ఆప్కాస్ లో తీసుకొని రూ.21,000 వేతనం అమలు చేయాలని, పారిశుద్ధ్య కార్మికులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, తదితర సమస్యలు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు తంగిరాల మహేష్, అధ్యక్ష, కార్యదర్శులు జి నరసింహ, టి విజయమ్మ, యూనియన్ నాయకులు కే మోహన్‌రావు, ఎం బాబు, వై రవి, కె సాల్మన్, వి భారతి, బి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన జన విజ్ఞాన వేదిక

ప్రపంచ మేధావులను తయారు చేసే గురువులను గౌరవించడం మనందరి బాధ్యత

డాక్టర్ సద్దాం హుస్సేన్





(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 16)
జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కంభం మండలంలోని హజరత్ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న ఎ సరోజిని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను పాఠశాలలో సన్మానించారు. అదే విధంగా హజరత్ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.డి. షబ్బీర్ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకున్న సందర్భంగా, అలాగే రావిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మధుసూదన్ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా కంభంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ ప్రపంచ మేధావులను తయారు చేసే గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అధ్యక్షుడు వరుకుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమసమాజ నిర్మాణానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ తరగతి గదిలోని నాలుగు గోడల మధ్య ప్రపంచ భవిష్యత్తును నిర్మించే గురువులను సన్మానించడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఉపాధ్యక్షుడు పార్థసారథి మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణానికి విద్యే పునాది, అదే సమాజానికి గొప్ప ఆస్తి అన్నారు. సన్మాన గ్రహీత ఎ సరోజిని మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం జీవితంలో మరువలేని మధుర జ్ఞాపకమన్నారు. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.డి. షబ్బీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వృత్తిపట్ల అంకితభావం, కార్యదక్షత కలిగి పనిచేయాలని, అప్పుడే విజయాన్ని సాధించగలమన్నారు. మధుసూదన్ మాట్లాడుతూ ఎంత ఎదిగినా అణిగిమణిగి ఉండాలని, జీవితంలో ఓర్పు, సహనం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ చెకుముకి కన్వీనర్ షేక్ నాయబ్ రసూల్, కోశాధికారి షేక్ మస్తాన్, యువ నాయకుడు జావిద్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కంభం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వీరనారాయణ, ఉపాధ్యాయులు కేశవులు, సోమశేఖర్, సుబ్బారావు, వరప్రసాద్, శివనారాయణ, సుజాత, రవి, నంది రెడ్డి, గఫూర్, లక్ష్మి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఉద్యోగాలు మంజూరు చేయాలి

ప్రభుత్వం నుండి కోటి రూపాయలు రిలీఫ్ ఫండ్ తెప్పించాలి

మార్కాపురం జిల్లా ఏర్పడి 8 నెలలయినా ఒక్కరికి కూడా ఎస్సీ, ఎస్టీ పెన్షన్ ఇవ్వలేదు

మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు దళిత నేత నీలం నాగేంద్ర ఫిర్యాదు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 16)
మార్కాపురం జిల్లాలో జరిగిన ఎస్సీ, ఎస్టీ హత్య కేసుల్లో ఉద్యోగాలు ఇవ్వాలని, రిలీఫ్ ఫండ్ కోటి రూపాయలు ప్రభుత్వం నుండి తెప్పించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావు మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు కు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి జిల్లా ఏర్పడి ఎనిమిదిన్నర నెలలైనా ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫైల్ కలెక్టర్ లో కదలటం లేదన్నారు. పూర్వపు ప్రకాశం జిల్లాలోని మార్కాపురం డివిజన్ ప్రస్తుత మార్కాపురం జిల్లా కు మంజూరైన 12 ఎస్సీ ఎస్టీ హత్య కేసుల్లోని బాధితులకు ప్రకాశం జిల్లా కలెక్టర్ చేసిన 12 ఎస్సీ ఎస్టీ పెన్షన్లను మంజూరు అనుమతి కోరుతూ మార్కాపురం కలెక్టరె ట్ కు ఫైలు పంపలేదన్నారు. అలాగే ఎర్రగొండపాలెం లో 2024 సంవత్సరంలో జరిగిన టూమాటి చెన్నమ్మ హత్య కేసులో అలాగే గిద్దలూరు పోలీస్ స్టేషన్లో 2018 వ సంవత్సరంలో జరిగిన పందిటి ప్రతాపను మాదిగ కులస్తుని హత్య కేసు, పుల్లలచెరువు మండలంలో జరిగిన గాడికొయ్య పిచ్చయ్య హత్య కేసులో కూడా ఉద్యోగాల ఫైళ్లు మెజిస్టీరియల్ సెక్షన్ లోనే ములుగుతున్నాయి అన్నారు. అలాగే ఇటీవల జిల్లా ఏర్పడిన రోజే బేస్తవారిపేటలో జరిగిన తర్లుపాడు మండలానికి చెందిన తాడివారిపల్లె కులస్తుడు జయంపు కృష్ణయ్య యానాది కులస్తుడి హత్య కేసులో ఎనిమిదిన్నర నెలలు అయినా సంబంధిత తర్లుపాడు తాసిల్దార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రాథమిక నివేదిక కూడా ఇవ్వలేదన్నారు. కనిగిరిలో గత సంవత్సరం అక్టోబర్ నెలలో జరిగిన కుడుముల ప్రకాష్ అను మాదిగ యువకుడ్ని బీసీ కులాల వారు హత్య చేస్తే పోలీస్ వారు ఎస్సీ, ఎస్టీ కోర్టులో చేసి మార్కాపురం కలెక్టరేట్ కి పంపిన సంబంధిత ఫైలు కూడా కలెక్టరేట్ సెక్షన్ లోనే కునుగుపాట్లు పడుతుందన్నారు. బాధితులు తిరుగుతున్న చూస్తాం అంటున్నారే కానీ ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫైల్ మాత్రం కదలటం లేదన్నారు. గతంలో కలెక్టర్ విజయ సునీతను కలిసి రెండుసార్లు ఫిర్యాదు చేసినా కానీ కలెక్టర్ మంజూరు కొరకు ఒక్క ఎస్సీ, ఎస్టీ ఫైలు కూడా రాలేదన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రెండుసార్లు ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ మంజూరు చేసారన్నారు. కానీ కలెక్టరేట్ నుండి రిలీఫ్ బడ్జెట్ ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి అందకపోవటంతో మార్కాపురం జిల్లాకు ఇంతవరకు ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ బడ్జెట్ రిలీజ్ కాలేదన్నారు. కావున ఎస్సీ ఎస్టీ హత్య కేసుల్లో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు మంజూరు చేయించవలసినదిగా ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫైళ్ళు పరిష్కరించ వలసినదిగా ప్రభుత్వం నుండి కోటి రూపాయలు బడ్జెట్ ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్ తెప్పించి ఎస్సీ, ఎస్టీ కేసుల్లోని బాధితులకు మంజూరు చేయవలసినదిగా జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులును ఆయన కోరారు. వెంటనే జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు మెజిస్టీరియల్ సెక్షన్ సూపర్ మెన్ రవీంద్రారెడ్డిని పిలిపించి ఎస్సీ, ఎస్టీల ఫైలు పరిష్కారానికి పంపాలని ఇంతకాలం ఎందుకు ఫైలు పెట్టలేదని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ ను కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి, మాల పరిరక్షణ సమితి కన్వీనర్ మేడికొండ మురళి, దళిత పరిరక్షణ సమితి కన్వీనర్ అంబటిపూడి రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.





ఓజోన్ పొర అనేది అన్ని జీవులను రక్షించే సహజ కవచం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 16)
ఓజోన్ పొర అనేది అన్ని జీవులను రక్షించే సహజ కవచం, ఇది సూర్యుని హానికరమైన యువి కిరణాలను గ్రహించడం ద్వారా మనల్ని రక్షిస్తుందని ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు వివరించారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవ సందర్భంగా చిన్నగంజాం జేడ్పి హైస్కూలు నందు ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఓజోన్ పొర ప్రాముఖ్యత, ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మనుషుల కార్యకలాపాలు, ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే రసాయనాలు, కాలుష్యం వంటివి ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయిని వివరించారు. అనంతరం విద్యార్థులచే ఓజోన్ రసాయన ఫార్ములా అయిన 03 ఆకారంలో విద్యార్థులతో ప్రదర్శన అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ పాఠశాలల పనులను సొంత పనులుగా భావించాలి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 16)
మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో చేపడుతున్న మౌలిక వసతుల పనులను ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంఆర్సీ సిబ్బంది సమన్వయంతో పర్యవేక్షించి నాణ్యతగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు సూచించారు. బుధవారం ఎంఈఓ 2లు, ఇంజనీరింగ్ అధికారులు, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్ఎంసీ కమిటీల మధ్య ఒప్పందం (ఎంవోయూ) పూర్తి చేసి, సంబంధిత పత్రాలను ఆన్‌లైన్‌లో బుధవారం సాయంత్రంలోగా అప్‌లోడ్ చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తమ సొంత పనులుగా భావించి బాధ్యతాయుతంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈనెల 29న నిర్వహించనున్న ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియపై ఎంఈఓలకు అవగాహన కల్పించారు. సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్ వెంకట్రావు, డీఈ రమణయ్య, ఉప విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, సంజీవి, ఏసీ కొండారెడ్డి, డీఎంఓ రామిరెడ్డి, ఏఎంఓ వెంకటేశ్వర్లు, సీఎంఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కరణం వెంకటేష్‌బాబు పిలుపు



(షణ్ముఖ వెలుగు, చీరాల, సెప్టెంబర్ 16)
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు సూచించారు. బుధవారం చీరాల మండలం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులకు ఐడీ కార్డులను అందజేశారు. అనంతరం కరణం వెంకటేష్‌బాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి నాయకుడు తన పరిధిలో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తూ ఎన్నికల సమయానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల, పట్టణ, గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం

వైసిపి ప్రభుత్వ సమయంలో ఏం అభివృద్ధి జరిగిందో, కూటమి ప్రభుత్వంలో ఏమి అభివృద్ధి జరిగిందో చర్చికి సిద్ధం

వైసిపి నాయకులు సిద్ధమా

కొత్తపట్నం మండలంలో రెవిన్యూ సమస్యల పై ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 16)
కొత్తపట్నం మండలంలో ఉన్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేకమైన ప్రజాదర్బార్ ను నిర్వహించి వాటి సమస్యలు పరిష్కారం కోసం అధికారులను ఆదేశించడం జరిగిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని నల్లూరి గార్డెన్స్‌లో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపట్నం లోని కొంతమంది వైఎస్ఆర్సిపి నేతలు రెండు సంవత్సరాలు కాలంలో ఒక పట్టా ఇచ్చారా అని మాట్లాడుతున్నారని మాట్లాడే ముందు ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. 14, 19లో దివ్యాంగులకు పట్టాలు ఇచ్చింది ఎవరు అని అన్నారు. మీరు రోజు తిరిగే మట్టి రోడ్డుని ఐదు సంవత్సరాలు పూర్తి చేయలేక పోతే తాము అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ పనిని పూర్తి చేసామని తెలిపారు. ఒక మాట మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలి అని ఎలా బడితే అలా మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. 100 కోట్ల రూపాయలు పైన పనులు చేశామని వైసిపి టైంలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ రెండేళ్లలోజరిగిన అభివృద్ధి పనులపై తాము చర్చికి సిద్ధమని మీరు కూడా సిద్ధమ అని ఆయన ప్రశ్నించారు. ఈతముక్కల్లో 62 మందికి చేనేత కాలనీలో పట్టాలు ఇచ్చామని, మీరు ఇచ్చిన జగన్ అన్న కాలనీలలో ఎవరైనా ఇల్లు నిర్మించుకున్నారా ప్రజలకు అనుకూలమైన స్థలాలు ఇచ్చారా అని అన్నారు. కొత్తపట్నం నుంచి ఒంగోలు రావాలన్న ఒంగోలు నుంచి కొత్తపట్నం పోవాలన్న ఆ రోజుల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని 2014-20 19 లో రోడ్డు విస్తరణతో పాటు బ్రిడ్జిలు నిర్మించమని ఈత ముక్క లలో బ్రిడ్జిలు నిర్మించామని మీరు ఏమి చేశారో ఒక్కసారి మళ్ళీ పునరుద్దించుకోవాలని అన్నారు. ఒక మాట మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని కాలం సమాధానం చెబుతుందని అన్నారు. కొత్తపట్నం ఎమ్మార్వో కార్యాలయం నుండి బీచ్ వరకు రోడ్డు విస్తరణతో పాటుగా సెంటర్ లైటింగ్ కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని అది కూడా త్వరలో పూర్తి చేస్తామని ఇవన్నీ పూర్తయితే కొత్తపట్నం మండలానికి ఒక సమస్య కూడా ఉండదని ఏదైనా చిన్న చిన్న సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, తహసిల్దార్ రామానాయుడు, చంద్రమౌళి, గాలం సుబ్బారావు, మండల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.









పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టంబర్ 16)
బుధవారం ఉప్పుటూరు అంగన్వాడి కేంద్రం నందు సిడిపిఓ సుభద్ర నేతృత్వంలో పౌష్టికాహార మాసం 2026 కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సిడిపిఓ సుభద్ర మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార విశిష్టతను, పథకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మొక్కై వంగనిది మానై వంగునా అన్న రీతిగా పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే వారి పట్ల శ్రద్ధ వహించి వారికి పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు, సరైన విద్యాబుద్ధులు నేర్పించాలని, అప్పుడే వారు పెద్దయిన తర్వాత కూడా మంచి ఆహారపు అలవాట్లను పాటించడంతోపాటు, సమాజాన్ని సరిదిద్ద గలరని చెప్పి, చంటి బిడ్డకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ దీప, ఎమ్మెల్‌హెచ్‌పి శృతి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.30,01,116 కు వినాయకుని లడ్డును వేలంపాటలో ముత్యాల సుబ్బారెడ్డి నారాయణరెడ్డి సొంతం చేసుకున్న వైనం

రూ.21,01,116 కు కలశం దక్కించుకున్న పలుగుళ్ళ నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, సెప్టంబర్ 16)
మండలంలోని అయ్యలూరివారి పల్లి లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయక చవితి లడ్డు, కలశంలను వేలం పాటల ద్వారా భక్తులు దక్కించుకున్నారు. గణేష్ లడ్డును ముత్యాల సుబ్బారెడ్డి రూ.30,01,116 కు దక్కించుకోగా, కలశం ను రూ.21,01,116 లకు పలుగుళ్ళ నారాయణరెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో తాము లడ్డు, కలశాన్ని దక్కించుకోవడం జరిగిందన్నారు.

అశోక్‌కుమార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ సమన్వయ కమిటీ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టంబర్ 16)
అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను మున్సిపల్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో ఎన్నికల సమన్వయ కమిటీ బాధ్యతలు అప్పగించినందుకు అశోక్‌కుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ బలోపేతం, వార్డుల వారీగా కార్యాచరణ, నాయకులు, కార్యకర్తల సమన్వయం పై చర్చించారు. పార్టీ విజయానికి కృషి చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లూరు సెక్టారులో పోషణ మాసం 2026

(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, సెప్టంబర్ 16)
టంగుటూరు మండలంలోని వల్లూరు ఎస్సీ కాలనీలో బుధవారం "పోషణ మాసం 2026" మన అంగన్వాడి – మన భాద్యత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సెక్టర్ సూపర్వైజర్ జి జ్యోతి స్థానిక తల్లులతో అంగన్వాడి సేవలు గురించి వివరించారు. పోషకాహార లేమితో తల్లులు పిల్లల్లో ఎదురవుతున్న సమస్యల గురించి అవగాహన కల్పించారు. ఈ క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యకరమైన తల్లులు, ఆరోగ్యమైన బిడ్డలు లక్ష్యంగా వెయ్యి రోజుల ప్రణాళిక రూపొందించాయన్నారు. ఆరోగ్యవంతమైన బాలికలు భారతదేశ భవిష్యత్తు అన్నారు. భావితరాల పిల్లల భవిష్యత్ కోసం ప్రతి బాలుడు, బాలిక కొరకు పోషకాహారం అందించడం, విద్యను పోత్సహించడం తల్లి మరియు శిశువు ఆరోగ్య సేవలు బలోపేతం చెయ్యడం, ఆటలతో అభ్యాసం,ఆరోగ్యకరమైన వికాసం, తల్లి గర్భం నుండి బిడ్డకు 2 సంవత్సరాల వయసు వచ్చేవరకు అంగన్వాడి కేంద్రాల్లో 1000 రోజులు పాటు తల్లులకు అందుతున్న సేవలు కల్పించబడుతున్న సౌకర్యాలను గురించి వివరించారు. అందరికి పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనం పోషక మాసం యొక్క ఉద్దేశమని సూపర్వైజర్ జి జ్యోతి స్థానిక తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెంటర్ పరిధిలోని తల్లులు, వల్లూరు 3 అంగన్వాడి కేంద్రం కార్యకర్త ఎస్ కళ్యాణి పాల్గొన్నారు.



బలరాం కాలనీలో నిర్మాణాల తనిఖీ

(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, సెప్టంబర్ 16)
చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని బలరాం కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పంచాయతీ కార్యదర్శి శృతి బుధవారం తనిఖీ చేశారు. నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భూమి హక్కు పత్రాలను పంచాయతీ కార్యాలయంలో చూపించిన అనంతరం మాత్రమే పనులు కొనసాగించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా, సరైన పత్రాలు లేకుండా చేపట్టే నిర్మాణాలను నిలిపివేయాలని కాలనీ వాసులకు తెలిపారు. ఇదిలా ఉండగా, కాలనీలోని సర్వే నంబర్లు 72/1, 72/2, 72/3, 72/4 పరిధిలోని భూములపై పాపినేని సుధాకర్‌రావు పలు ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో సోనా పోరంబోకు భూములను చదును చేసి పేదలకు పంపిణీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారని, అయితే అర్హులైన పేదలకు కాకుండా సంపన్నులకు భూములు వెళ్లాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. భూముల హక్కులు, అనుమతులు, రికార్డులను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరారు. అలాగే సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పాత నీటి వనరులను పునరుద్ధరించి సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.





ఇంటింటి సర్వేకు జిల్లా ప్రజలు సహకరించాలి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 16)
ఈనెల 24వ తారీఖు వరకు కుష్ఠ వ్యాధి గురించి ఆషా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వే కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలందరూ సహకరించాలని మార్కాపురం జిల్లా కుష్ఠ వ్యాధి నివారణాధికారి డాక్టర్ రాహుల్ విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 380 అనుమానిత మచ్చలు, లక్షణాలు వున్నవారిని ఆషా కార్యకర్తలు గుర్తించి ఆన్లైన్లో నమోదు చేశారని, వారందరినీ రాబోయే వారం రోజులలోపు సంబంధిత మెడికల్ ఆఫీసర్స్ పరీక్షించి వ్యాధి వున్నది, లేనిది నిర్ధారిస్తారని ఆయన తెలిపారు. మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో జరుగుతున్న సర్వేని ఆయన పరిశీలించారు. సర్వే నిరహిస్తున్న ఆషా కార్యకర్తకు, వాలంటీరుకి, మహిళా ఆరోగ్య కార్యకర్తకు సర్వే పకడ్బంధీగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికి సర్వే నిర్వహించిన అనంతరం తప్పక చాక్ పీసుతో హౌస్ మార్కింగ్ తప్పక చేయాలని కోరారు.

ఎన్ఎస్ నగర్‌లో మంటల కలకలం

గృహాల వైపు వ్యాపించిన మంటలు

అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 16)
పట్టణంలోని ఎన్ఎస్ నగర్‌లో బుధవారం సాయంత్రం ముళ్లపొదలకు మంటలు అంటుకుని పెద్దఎత్తున వ్యాపించాయి. లోచన్ కంటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న ముళ్లకంపులకు అకస్మాత్తుగా మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగతో పాటు భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు సమీపంలోని గృహాల వైపు వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నీటిని పిచికారీ చేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో మంటలు గృహాలకు వ్యాపించకుండా నివారించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై రాజకీయ పార్టీలతో సమావేశం



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, సెప్టంబర్ 16)
మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు2026కు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఎండీఓ హనుమంతరావు ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, సలహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 16)

పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ప్రకాశం జిల్లా డీఆర్‌పీ సౌజన్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు, ప్రవర్తన, పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలను ఆమె పరిశీలించారు. సిబ్బంది పనితీరును



మెరుగుపరిచేందుకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న క్యాంటీన్ నిర్వహణ ఉద్దేశం, ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఏఈ, నిర్వహణ కమిటీ అధికారులు, డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగర్‌ను హరిజనవాడగా పేర్కొనొద్దని వినతి

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన చిన్నగంజాం వైసీపీ నాయకులు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 16)


చిన్నగంజాం గ్రామపంచాయతీ పరిధిలోని 'అంబేద్కర్ నగర్'ను 'చిన్నగంజాం హరిజనవాడ'గా పేర్కొనడం పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బుధవారం ఎంపీడీవో కె ధనలక్ష్మికి ఎస్సీ సామాజికవర్గ



ప్రతినిధులు, గ్రామ పెద్దలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15-09-2026న జరిగిన ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ సమయంలో చిన్నగంజాం గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రం 18కు సంబంధించిన వివరాల్లో 'అంబేద్కర్ నగర్'కు బదులుగా 'చిన్నగంజాం హరిజనవాడ'గా నమోదు అయిందని తెలిపారు. గతంలో 10-02-1982న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల నందు ఎస్సీ, ఎస్టీ వర్గాలను సూచించేందుకు హరిజన, గిరిజన వంటి పదాలను ఉపయోగించరాదని, సంబంధిత వర్గాల అధికారిక పేర్లనే ఉపయోగించాలనే విషయన్ని వారు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రజలు స్థానికంగా ఆ ప్రాంతాన్ని 'అంబేద్కర్ నగర్'గా గుర్తించబడుతున్నందున, ప్రభుత్వ రికార్డులు, ఎన్నికల సంబంధిత పత్రాలు, పోలింగ్ స్టేషన్ వివరాలు తదితర అన్ని అధికారిక రికార్డుల్లో అదే పేరును నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ శాఖల నుంచి వెలువడే పత్రాలు, నోటిఫికేషన్లు, ఎన్నికల రికార్డులు తదితరాల్లో 'చిన్నగంజాం హరిజనవాడ' అనే పదానికి బదులుగా 'అంబేద్కర్ నగర్' పేరును ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

ఈ కార్యక్రమంలో చిన్నగంజాం మండల వైఎస్సార్ పార్టీ ఉపాధ్యక్షుడు మేడికొండ సునీల్, పార్టీ సీనియర్ నాయకులు కందుల విజయ్ బాబు, గ్రామ పెద్దలు మేడికొండ చిన్న అంకయ్య, రావూరి క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో స్వామివారి లడ్డూ ప్రసాదాలు దక్కించుకున్న మాచనూరు సాగర్





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 16)

మైదుకూరు పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వైభవంతో కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణేశుని దివ్య లడ్డూ వేలం పాటలు భక్తుల హరోంహర స్మరణలు, జయజయధ్వనాల మధ్య ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఈ లడ్డూల వేలంలో మైదుకూరు మున్సిపల్ మాజీ చైర్మన్ మాచనూరు చంద్ర కుమారుడు, ప్రముఖ యువ నాయకులు మాచనూరు సాగర్ స్వామివారి పై తనకున్న అపారమైన భక్తిని చాటుకున్నారు. ఒకే ఉత్సవాల్లో రెండు చోట్ల లడ్డూ ప్రసాదాలను వేలంలో పాడుకుని సగర్వంగా దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. నంద్యాల రోడ్డులోని కేసీ కెనాల్ వద్ద ప్రతిష్ఠించిన స్వామివారి దివ్య లడ్డూను రూ.80,000 సమర్పించి కైవసం చేసుకున్నారు. బద్వేల్ రోడ్డులోని వాసవీ నగర్ ఎదురుగా కొలువుదీరిన వినాయక విగ్రహ లడ్డూను రూ.50,000 దక్కించుకున్నారు. ఆధ్యాత్మిక సేవా నిరతితో స్వామివారి లడ్డూ ప్రసాదాలను పొంది, ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మాచనూరు సాగర్‌ని ఉత్సవ నిర్వాహకులు, కార్యకర్తలు, యువత ఘనంగా అభినందించారు. ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు మాచనూరు సాగర్, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ లభించాలని, స్వామివారి కృపతో వారు నిత్యం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లుతూ ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ భక్తి శ్రద్ధల వేడుకల్లో మైదుకూరు మున్సిపల్ మాజీ చైర్మన్ మాచనూరు చంద్రతో పాటు మండపాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ప్రముఖులు, కార్యకర్తలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.






బద్వేల్‌లో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 16)

వినాయక చవితిని పురస్కరించుకుని బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని బుధవారం సాయంత్రం ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా ప్రత్యేకంగా దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపానికి విచ్చేసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పలువురు నాయకులకు కార్యకర్తలకు ఉత్సవ కమిటీ సభ్యులు కేవి సుబ్బారావు, సగల సురేష్ బాబు, దొంతంశెట్టి జయ కుమార్, మేడ శేఖర్, సముద్రాల సురేష్, దర్శి సుమన్, ఇమ్మడిశెట్టి చంద్రశేఖర్, జొన్నలగడ్డ శేఖర్ తదితరులు సాధరంగా ఆహ్వానం పలికారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు పూర్తి చేసిన అనంతరం, ప్రజాప్రతినిధులను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ ఆ గణనాథుని దివ్య ఆశీస్సులతో బద్వేల్ నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తమ్మిని ఈ వేడుకలకు ఆహ్వానించి, స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య ప్రముఖులు, స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని గణపతిని దర్శించుకుని తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.





అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలి

ఏపిసిపిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)





అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని ఏపిసిపిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా విద్యుత్ సరఫరా పరిస్థితులు, వినియోగదారుల సేవలు, ఆదాయ వసూళ్లు తదితర అంశాల పై బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రకాశం జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వినియోగదారులకు అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫీడర్ పెట్రోలింగ్‌ను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణమయ్యే లోపాలను ముందుగానే గుర్తించి సకాలంలో సరిదిద్దాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ బిల్లుల వసూళ్లు, బకాయిల పరిస్థితిని సమీక్షించి, బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ పంపిణీ నష్టాలను తగ్గించడం, ఆదాయ వసూళ్లను మెరుగుపరచడం, పెండింగ్ పనులను వేగవంతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై సమీక్షిస్తూ, అర్హులైన రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను నిబంధనల ప్రకారం త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ భద్రతా చర్యలు, వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం, విద్యుత్ శాఖపై ప్రజల అభిప్రాయం తదితర అంశాలను కూడా సమీక్షించారు. అలాగే జిఐఎస్ మాపింగ్ , డీటీఆర్ మాపింగ్ పనులను వేగవంతం చేసి, అన్ని 33కెవి, 11కెవి ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానమైన సర్వీసుల వివరాలను ఆన్‌లైన్‌లో సమగ్రంగా పొందుపరచాలని అధికారులకు సూచించారు. దీనివల్ల వినియోగదారులకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. ఎంఎటిఎస్ కేసులను కూడా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం, విద్యుత్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆదాయ వసూళ్లను పెంచడం, పంపిణీ నష్టాలను తగ్గించడం, పెండింగ్ పనులను పూర్తి చేయడం వంటి అంశా ల్లో సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపిసిపిడిసిఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, సిస్టా వెంకటేశ్వర్లు , ప్రకాశం జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మైనార్టీ నాయకులు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 16)

తాడేపల్లిలోని వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు మైనార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కడప జిల్లా వైఎస్ఆర్‌సీపీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మహమ్మద్ ఉమ్మర్ ఆధ్వర్యంలో, షేక్ సయ్యద్ ఖాజాపీర్ ఆయన సోదరులతో కలిసి వైఎస్ జగన్‌ను కలవడం జరిగింది. ఈ సందర్భంగా జగన్‌కు వారు పూలబొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వైఎస్ఆర్ జిల్లాలోని మైనార్టీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నెల 21న నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్

రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్ష




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 16)

ఈ నెల 21వ తేదీ సోమవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మీడియాకు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు రెవెన్యూ మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెహ్రూనగర్ బోటు మీద ఉన్న వివిఎన్ గార్డెన్స్ నందు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, తదితర అన్ని శాఖల జిల్లా, నియోజకవర్గ స్థాయి ఉన్నతాధికారులు ప్రజా గ్రీవెన్స్ లో పాల్గొంటారని, అందుకు తగినట్లు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పెండింగ్ ఉన్న రెవెన్యూ, ఇతర సమస్యలను అర్జీల రూపంలో అందించి, పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, హోసింగ్ ఏఈ మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పుట్టినరోజు ప్రతి ఒక్కరూ దీపాలు వెలిగించాలి

గొబ్బూరి శ్రీనివాస నాయుడు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 16)

భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజున ప్రతి ఒక్కరు ఆయన దీర్ఘాయుష్ కోసం దీపాలు వెలిగించాలని బిజెపి మాచర్ల అసెంబ్లీ ఎస్ఐఆర్ కన్వీనర్ శ్రీనివాసరావు నాయుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గొబ్బూరి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17 సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే వేడుకలు. మోదీ పుట్టినరోజును కేవలం పండుగలా కాకుండా ప్రజా సేవగా మారుస్తోంది.ఆయన ప్రజా జీవితంలో(రాజకీయాల్లో) 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెప్టెంబర్17నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్నారు. 17వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో దీపాలు వెలిగించి మోదీ దీర్ఘాయుష్షు కోసం ప్రార్థించాలని గొబ్బూరి శ్రీనివాస్ నాయుడు కోరారు

మూడో రోజు కొత్తపట్నం నిమజ్జనానికి
కదిలిన గణేష్ విగ్రహాలు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)
గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులు బుధవారం మూడో రోజున నిమజ్జనానికి తరలివెళ్లారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా భక్తులు డప్పుల మోతలు, నృత్యాలతో ఉత్సాహంగా గణనాథులను సాగనంపడంతో కొత్తపట్నం వైపు పండుగ వాతావరణం నెలకొంది. నిమజ్జనం కోసం కొత్తపట్నం సముద్రతీరానికి వివిధ ప్రాంతాల నుంచి సుమారు 110 గణేష్ విగ్రహాలు తరలివచ్చాయి. గణనాథుల ఊరేగింపుల్లో యువత, చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. భక్తులు గణపతి నామస్మరణలతో నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా జిల్లా ఎస్పీ పి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు, సూచనలతో కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్, తన సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపట్టి, నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.















కవలలకు సాధారణ ప్రసవం
తల్లి, పిల్లలు క్షేమం

మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్
మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సురక్షిత ప్రసవం..
రాష్ట్రస్థాయి నెలవారీ ప్రసవాల ర్యాంకింగ్స్‌లో
3వ స్థానం సాధించిన ఆరోగ్య కేంద్రం



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 16)
ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వైద్యరంగానికి మిగుల ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న దృక్పదంలో భాగంగా తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్య సిబ్బంది మరో సారి తమ సేవా సామర్థ్యాన్ని, సేవా తత్పరతను చాటుకుంది. బుధవారం తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో మండలంలోని నాగెళ్లముడుపు గ్రామానికి చెందిన తిరుమల సుబ్బమ్మ కవల శిశువులకు సాధారణ ప్రసవం ద్వారా జన్మనిచ్చారన్నారు. దీంతో తల్లి, ఇరువుర శిశువులు క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలియజేశారు. శిశువులిద్దరూ ఒక్కొక్కరు సుమారు 2.5 కిలోల బరువుతో ఆరోగ్యంగా ఉన్నారన్నారు. నిత్యం ఈ వైద్యశాలలో రోజుకు 80 నుండి 100 ఓపీలకు వైద్యసేవలు రోగులకు అందించడం జరుగుతుందన్నారు. మారుమూల గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న విధానానికి గుర్తింపుగా ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి నెలవారీ ప్రసవాల ర్యాంకింగ్స్‌లో మండల కేంద్రమైన తర్లుపాడులోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 3వ ర్యాంక్ లభించింది. ప్రసవ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవల్లో నుహెడ్, నర్స్, విజయ, సిబ్బంది అతి చాకచక్యంగా చురుగ్గా స్పందిస్తున్నారు. పాము కాటుకు గురైన పలువురికి సకాలంలో స్పందించి చికిత్సలు అందించి పోగుల ప్రాణాలుకాపాడి ప్రజల మన్ననలు పొందిన సందర్భాలు ఉన్నాయని వైద్యాధికారి డాక్టర్ హరీష్ తెలిపారు. అంతే కాక ఆడ శిశువుల జననానికి ప్రతి ఒక్కరి ప్రోత్సాహం ఉండాలన్నారు."ఆడపిల్ల అంటే వద్దు" ఆడపిల్ల అంటే ముద్దు అనే భావనను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. ఆడ శిశువుల జననాన్ని ప్రోత్సహించేందుకు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా ముందడుగు వేస్తున్నారన్నారు. ఆడశిశువులకు జన్మనిచ్చిన తల్లులను తమ సొంతఖర్చులతోపుట్టింటి ఆడపడుచులా చీర, పసుపు-కుంకుమ అందించి వారు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించి పంపడం జరుగుతుందన్నారు "ఆడపిల్ల కుటుంబానికి భారం కాదు" కుటుంబానికి అండ, వెలుగు అన్నారు. సమాజాభివృద్ధికి, దేశభవిష్యత్తు శాంతి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే మాతృమూర్తుల్లా, శక్తి స్వరూపుల్లా ఉంటారని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్, హెడ్ నర్స్ పి విజయ, ఫార్మసిస్ట్ రవికిరణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా ఆర్యవైశ్య రూరల్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

కడప జిల్లా రూరల్ సంఘం కమిటీకి ప్రమాణ స్వీకారం ఆహ్వానం పత్రిక అందజేసిన నెల్లూరు రూరల్ సంఘం కమిటీ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 16)
ఈ నెల 20వ తేదీన నెల్లూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం కర్నూలు నుండి నెల్లూరుకి వెళ్తూ మార్గమధ్యంలో బద్వేల్ పట్టణంలోని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు తులసి నాగరాజా, జిల్లా వైస్ చైర్మన్ కొలిశెట్టి వెంకటసుబ్బయ్య, జిల్లా జాయింట్ ట్రెజరర్ మల్లేముల నాగరాజాతో పాటు పలువురు పాలకవర్గానికి ఈ నెల 20వ తేదీన నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం మహోత్సవానికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ తట్టవర్తి రమేష్, నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర యాదగిరి సుబ్బారాయుడు గుప్త, ట్రెజరర్ మాలకొండయ్య, వైస్ ప్రెసిడెంట్ పబ్బిశెట్టి చంద్రశేఖర్, మద్దాల రమేష్, బద్వేల్ పట్టణానికి విచ్చేసిన పలువురికి కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికి శాలువాతో పలువురిని సత్కరించడం జరిగింది.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

వైభవంగా మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు
బిజెపి నాయకుడు బొమ్మన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అన్నదానం





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 16)

కడప జిల్లా బద్వేల్ మండలం అప్పరాజుపేట గ్రామంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బొమ్మన ఫౌండేషన్ అధ్యక్షులు బొమ్మన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పరాజుపేట గ్రామంలో గ్రామ పెద్దలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు చిన్నారుల సమక్షంలో సత్యకుమార్ గారి పుట్టినరోజు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గ్రామంలో పేదలకు, ప్రజలకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి సేవలు అభినందనీయం

ఈ కార్యక్రమంలో బొమ్మన సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ప్రజలకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయం. వైద్య రంగంలో ఆయన తీసుకువస్తున్న విప్లవాత్మక సంస్కరణలు సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


నేడు గుంటూరు జిల్లా కలెక్టరేట్ ముట్టడి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 16)

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు గురువారం గుంటూరు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాచర్ల రూబేను మాదిగ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లు గ్రామంలో ఈ నెల 1న పోలీసుల లాకప్ డెత్ కు గురై గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన చీకటి గోపి విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి చంపపెట్టుగా గుంటూరు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాచర్ల రూబేను మాదిగ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాచర్ల రూబెన్ మాదిగ, మాట్లాడుతూ మరి కొన్ని గ్రామాలలో ఇప్పటికీ అంటరానితనం, కుల వివక్ష, దళితులంటే చిన్నచూపు, పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి గోపి లాకప్ డెత్ పై ఐపీఎస్ స్థాయి అధికారితో సిట్ విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీకటి గోపి మృతికి బాధ్యులైన పోలీసులపై హత్య, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, గోపి మృతికి బాధ్యులైన తాడికొండ సీఐ, ఎస్ఐతో సహా పోలీసు సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని, సీఐపై ఆరోపణలు ఉన్నప్పుడు అదే స్థాయి అధికారి విచారణ ఎలా చేస్తారు ? అని మందకృష్ణ మాదిగ సూటిగా ప్రశ్నించారు. సాయికృష్ణ లాకప్ డెత్ తరహాలో గోపి కేసులోనూ ఐపీఎస్, అధికారితో సిట్ ఏర్పాటు చేయాలని, బాధ్యులైన పోలీసుల పై కేసు నమోదు చేసి సిట్ విచారణ చేసే వరకు పోరాటం చేస్తాం అన్నారు, గోపి కుటుంబాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలిపించుకుని మాట్లాడాలని సూచించారు, గోపి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్, జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. ప్రభుత్వం వివక్షతో కూడిన నిర్ణయాలు తీసుకోవద్దు దళిత యువకుడు లాకప్ డెత్ ఆరోపణలపై చనిపోతే ప్రతిపక్ష నేత ఎందుకు పరామర్శించలేదు అని సూటిగా ప్రశ్నించారు.

సుమిత్రానగర్‌లో ముగిసిన వినాయక చవితి ఉత్సవాలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 16)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి ప్రాంగణంలో వినాయక చవితి పురస్కరించుకొని కాలనీవాసులు వంశీ, సుబ్రహ్మణ్యం, మురళి, బాబు, నారాయణ, ఖలీల్, సుభాన్, సుల్తాన్ నా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద బుధవారం మూడవరోజు సందర్భంగా మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడవరోజు స్వామివారి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదం, చెరుకు గడలు, కుంకుమ భరణి, కలశం, చంబు, పలు రకాల స్వామివారి ప్రసాదాలను పలువురు భక్తులు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. రూ.70 వేల కు స్వామివారి వద్ద ఉంచిన లడ్డును కోన చంద్రశేఖర్, కందుల వెంకటరమణ సొంతం చేసుకున్నారు. అలాగే స్వామివారి వద్ద ఉంచిన కుంకుమ భరణి రూ.23 వేలుతో కోటపాటి సావిత్రమ్మ, అలాగే స్వామివారి మెడలో వేసిన లక్ష్మీమాలను రూ.38 వేలతో సిరిగిరి అద్విక సిరి అలాగే స్వామివారి వద్ద ఉంచిన కలసం చంబు రూ.9 వేల తో కోటపాటి సావిత్రి, స్వామి వారి వద్ద ఉంచిన చెరుకు గడలు ఫ్రూట్స్ను రూ.6,000 రూపాయలతో మైలపల్లి సీనయ్య దక్కించుకున్నారు. వారికి ఉత్సవ కమిటీ సభ్యులు కేరళ బ్యాండ్ వాయిద్యాలతో టపాసులు కాల్చుకుంటూ వారిని గజమాలలు, శాలువాలతో సత్కరించి వారి స్వగృహం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం వినాయక చవితి ఉత్సవాలకు సహకరించిన పలువురికి శాలువాలతో సత్కరించి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఇక సెలవయ్య గణపయ్య అంటూ స్వామివారిని నిమజ్జనం కార్యక్రమానికి తరలించారు స్వామివారి మెరమని వెంబడి ప్రత్యేక ప్రసాదాలను భక్తులకు అందజేశారు. అనంతరం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లం కొండు వెంకటరమణ, ధనలక్ష్మి దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.





రూ.75.11 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 16)

ముఖ్యమంత్రి సహాయనిధి నియోజకవర్గ ప్రజలకు ఎంతో ధీమానిస్తోందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 68 మంది లబ్ధిదారులకు మంజూరైన మొత్తం రూ.75,11,230 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రొద్దుటూరులోని తమ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గారు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు.

ఎవిధ తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం పెద్ద ఉపశమనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల క్షేమమే తన ధ్యేయమని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సమర్థవంతంగా అందేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్
ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ
సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు





(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 11)

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రొద్దుటూరులోని క్యాంపు కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మైదుకూరు నియోజకవర్గ ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలైన విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, విద్యుత్, రెవెన్యూ, పింఛన్లు మరియు సంక్షేమ పథకాలకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఓపికగా పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అధికారులతో అక్కడికక్కడే సమీక్ష


అర్జీల పరిశీలన అనంతరం ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజా సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
ఎమ్మెల్యే పుట్టా

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉండటమే నా మొదటి బాధ్యత. ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరిస్తాం. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తాను అని స్పష్టం చేశారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో తప్పనిసరి

సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదు..!
జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
నియోగదారుల ఇష్ట ప్రకారమే చెల్లింపు ఉండాలి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 16)

హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు తదితర సంస్థల్లో వినియోగదారుల నుంచి తప్పనిసరిగా సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదని, వినియోగదారుల హక్కులను కాపాడేందుకు కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ జారీ చేసిన నిబంధనలను సంబంధిత సంస్థలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. 2022 జూలై 4న కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ హోటళ్లు, రెస్టారెంట్లలో సర్వీస్ ఛార్జీ వసూలుకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. సర్వీస్ ఛార్జీకి సంబంధించిన నిబంధనలపై హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కేంద్రం కోరిందని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. వినియోగదారుల పై అనవసరమైన రుసుములు వేయకుండా, బిల్లింగ్‌లో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లు తమ బిల్లుల్లో సర్వీస్ ఛార్జీని ముందుగానే కలిపి వసూలు చేయరాదని తెలిపారు. వినియోగదారుడు స్వచ్ఛందంగా చెల్లిస్తే తప్ప, సర్వీస్ ఛార్జీని తప్పనిసరి చేయకూడదన్నారు. సర్వీస్ ఛార్జీ పేరుతో కాకుండా ఇతర పేర్లతో వసూలు చేసినా, అది సర్వీస్ ఛార్జీ కిందకే వస్తుందని తెలిపారు. సర్వీస్ ఛార్జీ చెల్లించలేదనే కారణంతో వినియోగదారుడిని హోటల్ లేదా రెస్టారెంట్‌లోకి అనుమతించకుండా ఉండటం, సేవలు అందించకపోవడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. వినియోగదారుడు ఏ సేవకు ఎంత చెల్లించాలో బిల్లులో స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే సర్వీస్ ఛార్జీకి బదులుగా 'సిబ్బంది సంక్షేమ రుసుము', 'ఉద్యోగుల సంక్షేమ రుసుము', 'సర్వీస్ ఫీజు', 'హాస్పిటాలిటీ ఛార్జీ' వంటి పేర్లు పెట్టి తప్పనిసరిగా డబ్బు వసూలు చేసినా, దానిని సర్వీస్ ఛార్జీగానే పరిగణిస్తామని తెలిపారు. పేరు మార్చినంత మాత్రాన నిబంధనల నుంచి తప్పించుకునే అవకాశం లేదన్నారు. సర్వీస్ ఛార్జీని ఆహార బిల్లులో కలిపి, దానిపై వస్తు సేవల పన్ను విధించకూడదని కూడా నిబంధనల్లో స్పష్టం చేసినట్లు తెలిపారు. వినియోగదారులు తమకు ఇచ్చే బిల్లును జాగ్రత్తగా పరిశీలించాలని, అదనంగా ఏదైనా రుసుము వసూలు చేస్తున్నారా లేదా అన్నది గమనించాలని సూచించారు. వినియోగదారుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నిబంధనలను పాటిస్తూ వినియోగదారులకు స్పష్టమైన బిల్లులు ఇవ్వాలని, ఎలాంటి బలవంతపు సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.